ప్రాణావు. అందుకే చెంగయ్యకి కోపం. నిన్ను లొంగదీసుకోవాలని పూరివాళ్ళ ప్రయత్నం. సమయం దాటబెట్టుకోకు, త్వరగా చొక్కా లేకపోయినా నా జరీకండువా వేసుకెళ్లు. జంద్యం మరచిపోకు, చెంగయ్య లక్షరూపాయలు కట్నమిచ్చి కూతురికి పెళ్ళి చేస్తున్నాడు. "పంచరత్నాలు" వ్రాసుకెళ్ళి నమస్కారంచేస్తే వెయ్యినూటపదహార్లు చేతిలో పెడతాడు. నీ పసిపిల్లల కోసమైనా నీ వేదాంతం విడచిపెట్టు, త్వరగా బయలుదేరు" అన్నాడు.

నా జీవితంలో వాడిని మరువలేను. నా ముద్దు పాపాయిలు నాకు దక్కేటట్లు, లోకంలో దిక్కులేనివాడిగా చావకుండా నాలుగురాళ్ళు సంపాదించుకుని లోకంలో నూటికి తొంభై తొమ్మిదిమందిచేత "మహానుభావుడు" అనిపించుకునేటట్లు నన్ను తయారుచేశాడు.

నేనిప్పుడు అందరికీ అవసరం. చెంగయ్యగారి సినీమాకంపెనీలో కవిని. కాబోయే డైరక్టర్ని. ఒక్క అరకప్పు టీ ఇస్తానంటే నా ఇంటర్వ్యూ లభిస్తుంది. కొంచెం వక్కపొడి పెట్టి, ఒక గోల్డు ఫ్లేక్ సిగరెట్టు యిచ్చి నా నమస్కారములు అందుకోండి.

స్కెచ్

# మా గురుదేవులు

"కృష్ణానంద్"

"నీవే తల్లివి దండ్రివి..." అన్నట్లు మా ఆచార్యులవారే మాకు సమస్తమూను! మా ఆచార్యులు అంటే, ఏమని చెప్పాలి?—మా ఆచార్యులు. ఆచార్యులవారనే అంటూంటారు. ఆయన మా గురుదేవులు; ఆశ్రమ రాజ్యాధిపతులు! "గురు పాఠీనమవయి జలగ్రహంబవయి క్రోడంబవయి..." శ్రీ మహావిష్ణువవలె మా గురుదేవులుకూడా అనేక జన్మల్లో అనేక ఘనకార్యములు చేసియున్నారు. విష్ణువు అవతరించినప్పుడెల్లవారికీ ప్రతికక్షులుగా తమ అంశల్లోంచి రావణ కుంభకర్ణ శిశుపాల దంతవక్త్రాది రాక్షసుల్ని సృజించి పోటీగా నిలబెట్టిన ధీశాలురు. పూర్వ పురాణయుగాల్లో కొందరికి తమ అంశవున్నట్టు మొన్న సమాధిలోంచి లేచినప్పుడు చెప్పినట్లు జ్ఞాపకం! రాక్షస గురువైన శుక్రాచార్యులు మా ఆచార్యులవారి మేధస్సులోని కుళ్ళిపోయిన భాగంలోంచి ఉద్భవించాడని వారే సెలవిచ్చారు. మేము (శిష్యులం) నమ్మక తప్పలేదు. ఆయన చెప్పిన "వేదాక్షరాలన్నీ" నమ్మేరకం మేము. భారత యుద్ధకాలంలోని "మామ శకుని" గూడా వీరి జటాజూటంలోంచి ఒకానొక సమయంలో వూడి పడ్డాడని ఒక సందర్భంలో, జలకమాడిన పిదప పిలక ముడివేసుకొంటూ, అన్నారు మా గురువర్యులు. మా ఆచార్యులవారి శిఖాగ్ర పుంసత్వానికి మాఒళ్ళు పులకరించింది. పంచతంత్రంలో పంచానన్నాన్ని సైతం పల్టీకొట్టించి కుయుక్తులతో కుతంత్రాలతో, లోపల కుళ్ళు పైకి దరహాస వదనంతో కథ నాక్రమించే దమనకుండు మావారి అర్థాంశ! మంత్రి యుగంధరుడు మాగురుశేఖరులు తుమ్మినపుడు నాశికారంధ్రాల్లోంచి బహిర్గతమైనట్లు ప్రజలు చెప్పుకొంటుంటే విన్నాం. చాణక్యుడుకూడా మా ఆచార్యులవారి కణతలు ద్వారబంధంతగిలి చిట్లినప్పుడు కారిన రక్తంలోంచి జనించాడని చూసినవాళ్లు (అప్పుడు) రాసేరు. మహాజ్ఞాని అయిన పిచ్చి తుగ్లక్ మావారి పూర్ణాంశ!, ఔరంగజేబు, గజినీ, ఘోరీ ఇత్యాదులు,మాయ,కుళ్ళు,స్వార్థం అసూయలతో నిండివున్న ఈ ప్రపంచంలో వుండుటవలన కళంకితమైన మా గురుదేవులశరీరమునుండి ప్రవహించు చెమటనుండివచ్చినవారు. ఒక్క మాదేశంలోనే కాకుండా విదేశాల్లోకూడా తాము అవతారాలనుఎత్తినట్లు వారు సెలవిస్తుంటారు. షేక్స్పియర్ డ్రామాల్లోని విలన్లంతా వీరి కోపతాప పాప బడబాగ్నుల్లోంచి లేచి వచ్చినవారు. దుర్వాస విశ్వామిత్రాది "సూరాకారపు" మహర్షులంతా మావారి సహాధ్యాయులట! ఇదంతా మా ఆచార్య గురువర్యులు వివరించిన పూర్వజన్మ

వృత్తాంతసారాంశసారము! సామాన్యులమయిన మేము మా జ్ఞాపకశక్తికి లోబడినదానిని మీకు తెలియజేసినారము.

ఇక "చెప్పేవి శ్రీరంగనీతులు..." అన్న పూర్వసామెతకి అతీతులుకారు మా ఆచార్యుల వారు. అసలు ప్రకృతే ద్వంద్వము. సృష్టిలోని ప్రాణులన్నీ ద్వంద్వబద్ధమైనవి. మా ఆచార్య శేఖరులు ద్వంద్వాతీతులుకారు, జితేంద్రియు లంతకంటె కాదు. ఆయన శ్రీరంగనీతులూ బోధిస్తూనేవుంటారు. తమపనులు నెమ్మదిగా కానిస్తూనే వుంటారు. అది వారికి సహజం. విశాలహృదయులమయిన మేము అపోహలకు అనుమానాలకు తావుఇవ్వం. ఆయన మమ్మల్ని కనిపెట్టుకొని మా మేలుకోరే ఆయనేగామరి!

ద్వంద్వాతీతులుగాని మా గురువుగారికి పక్షపాత బుద్ధివుంది అని మేము అనుకోడంలో ఇసుమంతేనియు దోసముండదని మా దృఢనమ్మకం. దానిని మేము లెక్కచేయం. మా ఆశ్రమం నివాసయోగ్యంగానే వుంటుంది. దానిని రెండు భాగాలుగా విభజించి అందులో కొంచం సౌఖ్యముగా విశాలంగావుండే భాగం వారి శాఖీయులయిన శిష్యులకు ఇచ్చారు. మాకువీధిలోవసారా తగలేశారు, పక్షపాతి అయిన మా గురువుగారు. అప్పటికీ వారి శాఖీయులైన శిష్యగణాలు మా నెత్తినే ఎక్కుతుంటాయి. వాళ్ళకి మేం సహాయము చెయ్యాలి అని గురువర్యులు ఆజ్ఞాపించారు! ఎలాగైనా మా ఆచార్యులవారు ద్వంద్వబద్ధులే కదూ! గురువుగారి సుందరమైన మధ్య గది వారి తదనంతరం వారి శాఖీయులకే వచ్చేట్లు ప్రయత్నాలు చేస్తున్నారు వారు. దానికి అనేక రహస్య ఆలోచనలు, కుంభకోణాలు జరుగుతున్నాయి. ఏమి జరుగనున్నదో?

మా గురువుగారు ప్రతీకోణంలోను స్వయం ప్రకాశమైన ఒక మణి! ప్రతి జీవితాన్ని అనుభవించి చూసిన అనుభవశాలి! అన్నిటిలోను సిద్ధహస్తులు. అన్నిశాస్త్రాలమీదాఅనర్గళంగా మాటలాడగల ధీశాలి! ఆయనకు ఆయనే సాటి.

మా ఆశ్రమం యొక్క జమాఖర్చులు అన్నీ ఎప్పటికప్పుడు తాటియాకులమీద ఎక్కించాలని గుర్వాజ్ఞ. వాటిని ఎర్రటి దారాలతో కట్టాలని వారికుతూహలం. ఎరుపు కంటికింపుగా డాబుగా ఉంటుందని వారి ఉద్దేశం. ఆఖరికి మాజండాలు కూడా కుంకంలో ముంచి ఎర్రగాచేసి ఇస్తుంటారు. అంతరార్థం అగమ్యగోచరం.

శిష్యులమయిన మా ప్రవర్తన బాగుండలేదని ఆమధ్య ఆశ్రమవార్షికోత్సవ సందర్భంలో గురువర్యులుద్ఘాటించారు. గురువులికి శిష్యులు లోకువనేది లోకరివాజు. మా నడవడి ఎంత బాగున్నప్పటికీ గురుశేఖరులకు నచ్చకపోవడం మా దురదృష్టం. అందుకని మమ్మల్ని దారిలో పెట్టడానికి కొందరు మామీద వారిచే నియమితులైనారు.

ఒకళ్ళని ఎప్పుడూ నమ్మేరకం కాదు మా గురువుగారు. వారి పనులు వారే చేసుకుంటుంటారు. ఆయన శక్తిలో ఆయనకే విపరీతమైన మూఢనమ్మకం. అందులో మాకు సందేహం. గురువుల శక్తి సామర్థ్యాలు శిష్యులకి బాగాతెలుస్తాయి గదా మరి!

రష్యా, చైనా దేశాలను ఉదహరిస్తూ, ఆ రెండుదేశాలలోనూ సాధించబడిన అభ్యుదయం అక్కడి ప్రజానీకం కష్టపడి పనిచేసిన ఫలితంగా వచ్చినదని మనం గ్రహించడం అవసరం అన్న పండితనెహ్రూ ప్రకటనపై వ్యాఖ్యానిస్తూ, "విజిల్" పత్రిక యిలావ్రాసింది: "ఆదేశాల్లో జారుచక్రవర్తులకాలంలోనూ, చియాంగ్-కై షేక్ పాలనలోనూ కష్టపడి పనిచేసినది ఆ ప్రజలే. వాళ్ళు మారిపోలేదు. కానీ, పాలనావ్యవస్థపై అంతస్థులలో మార్పువచ్చిన కారణాన ప్రజలు ఇతోధికంగా కష్టపడి ప్రభుత్వంతో మనస్ఫూర్తిగా సహకరించారు."